జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజలకు శ్రీరామ రక్ష

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల పాలిట శ్రీరామరక్ష అని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం పులివెందుల మండల పరిధిలోని అచ్చువెల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాంధవి, సర్పంచులు వీరలక్ష్మీదేవి, విజయ్‌కుమార్‌రెడ్డి, వైద్యులు, సూపర్‌వైజర్లు, సచివాలయ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : బోనాల సచివాలయ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి పాల్గొని మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ బోనాల, అంకెవానిపల్లెకు చెందిన 403 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సర్పంచ్ అనూరాధ, ఎంపీటీసీ పోచంరెడ్డి కళ్యాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్యాధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



ముద్దనూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి



వల్లూరు : మందులను పంపిణీ చేస్తున్న మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి



లింగాలలో మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని రామిరెడ్డిపల్లెలో జగనన్న ఆరోగ్యసురక్ష హెల్త్ క్యాంపును మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, జిల్లా కోఆర్డినేటర్లు నాగేంద్రరెడ్డి, శివారెడ్డిలు పరిశీలించారు. గత టీడీపీ ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ రాంప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : రాష్ట్రంలోని పేదలందరికీ ఉచిత వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కొలవలి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలందరూ వైద్యుల ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : తలపనూరు సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అనంతరం ఆరోగ్య సురక్ష కిట్‌లను రోగులకు అందజేశారు. ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహారానికి సంబంధించిన స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి జ్యోతి, సర్పంచు శివమారుతిరెడ్డి, మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగిరెడ్డిపల్లెలో

మండలంలోని గంగిరెడ్డిపల్లె సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సంగాలపల్లె, మిట్టపల్లె, లింగాల, గంగిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వల్లూరులో..

వల్లూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో అందరికీ ఆరోగ్య సంరక్షణ సాధ్యమవుతుందని మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. మండలంలోని దిగువపల్లె గ్రామ సచివాలయంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వైద్యుల ఆధ్వర్యంలో వివిధ వైద్య పరీక్షలను నిర్వహించి వైద్య సేవలను అందించి మందులను ఉచితంగా అందచేశారు. మొత్తం 220 మంది వైద్య సేవలను పొందగా, 11 మందిని ఉన్నత స్థాయి వైద్య సేవలకై రెఫర్ చేశారు. అనంతరం వీరారెడ్డి చేతుల మీదుగా మందులను, ఆయుస్మాన్ భవ ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుళాయప్ప, ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుట్టపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ జేసునాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవరంగుట్టపల్లె పాఠశాలకు చెందిన విద్యార్థులు రాయచోటిలోని మూసాపేట ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14, అండర్-17 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ విభాగంలో 7 మంది విద్యార్థినీలు, 5 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. అలాగే మండలంలోని గురిజాలకు చెందిన ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఈనెల 2వ తేదీ జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి పోటీలలో మంచి ప్రతిభ చూపించడంతో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ విద్యార్థి ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు మైదుకూరులో జరిగే అండర్-17 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థుల ఎంపికపట్ల పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీరమణమ్మ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కోవరంగుట్టపల్లె విద్యార్థులు

నేటి నుంచి శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్లు

వేముల : మండల వ్యాప్తంగా ఆయా రైతు భరోసా కేంద్రాలలో గురువారం నుంచి రబీ సాగుకు సబ్సిడీ శనగ విత్తనాలకు రైతులు రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. ఒక్కో రైతుకు ఎకరాకు 20కిలోల ప్యాకెట్లు రెండు చొప్పున గరిష్టంగా 10 ప్యాకెట్ల వరకు 40శాతం సబ్సిడీతో రైతులకు ఇస్తామన్నారు. క్వింటా రూ.4860లతో ఇస్తున్నామన్నారు. సాగుకు అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెండ్లిమర్రి : బుడ్డశనగ పంట సాగు చేసే రైతులు ప్రభుత్వం సబ్సిడీకి అందించే బుడ్డశనగ విత్తనాల నమోదు గురువారం నుంచి ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రారంభమవుతుందని వ్యవసాయాధికారిని బ్లెస్సీ ఒక ప్రకటనలో తెలిపారు. పెండ్లిమర్రి మండలానికి 832 క్వింటాల్ శనగ విత్తనాలు మంజూరైయ్యాన్నారు. వీటిని రైతులకు 40 శాతం సబ్సిడీతో సరఫరా చేస్తామన్నారు. క్వింటాల్ పూర్తి ధర రూ.8100కాగా సబ్సిడీ రూ.3240 పోను రైతు వాటా రూ.4860 చెల్లించాలన్నారు. ఒక ఎకరాకు 40 కిలోల విత్తనాలు అందిస్తామన్నారు. పంట సాగు చేసే రైతులు తమ పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో సంబంధిత రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

అందరికి అండగా వైఎస్ జగనన్న ప్రభుత్వం

పులివెందుల టౌన్ : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికి అండగా నిలుస్తున్నారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక బయమ్మతోట సచివాలయ పరిధిలోని రెడ్డివారివీధి, బుల్లావీరప్ప వీధి, కచేరిరోడ్డు, పుల్లారెడ్డి ఆసుపత్రి, క్రిస్టియన్‌లైన్, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న వస్తే అన్నివర్గాల ప్రజలకు మరిన్ని పథకాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్ కాంతమ్మ, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

బాల్యవివాహాలను ఆపుదాం

వేంపల్లె : బాల్యవివాహాలను ఆపి వారిని రక్షించుదామని తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నిసా తెలిపారు. బుధవారం వేంపల్లె 7వ సచివాలయంలో ఉన్న జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆమె బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు ఉండాలన్నారు. తక్కువ వయసులో వివాహం జరిగితే నేరమన్నారు. చిన్నవయసులో వివాహం చేసిన తల్లిదండ్రులకు, వారి బంధువులకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేయడం నేరం

కొండాపురం : మండలంలోని రేగడిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అని మహిళ పోలీస్ నజ్మ తెలిపారు. బుధవారం ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల ఆనారోగ్యాలకు గురి అవుతారన్నారు. బాల్య వివాహం జరిగితే రాష్ట్ర అందిస్తున్న సంక్షేమ పథకాలు అందవన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : బాల్య వివాహాలను అరికట్టవలసిన బాధ్యత అందరికి ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య తెలిపారు. బుధవారం స్థానిక 15, 16 వార్డుల సచివాలయంలో బాల్యవిహాల నిర్మూలనపై నర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సరైన వయసులోనే పెండ్లి చేస్తే వారికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవన్నారు. తల్లిదండ్రుల వద్దకు వెళ్లి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి అధికారి బాధ్యతగా కృషిచేయాలని తహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బాల్య వివాహాల నివారణపై సమావేశం జరిగింది. ఎంపీడీఓ రహమత్తులయ్య, ఎంఈఓ శివప్రసాద్, ఏపీఎం జగదీశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రవీణలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

తొండూరు : ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు సాధించవచ్చునని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు తెలిపారు. బుధవారం మండలంలో ప్రకృతి వ్యవసాయ పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రకృతివ్యవసాయం ద్వారా ఒక ఎకరా బీడు భూమిలో కంది, ఆముదం, అలసంద, అనప, సజ్జ విత్తనాలతో మోడల్ వేయడం జరిగిందన్నారు. దీనివల్ల బీడు భూమిలో కూడా ఎలా పంట సాగుచేయాలి.. రైతులకు ఏవిధంగా ఉపయోగపడతాయి.. విశిష్టత గురించి వివరించామన్నారు. మండలంలోని శివరాజారెడ్డి పొలంలో సాగుచేసిన ఏటీఎం మోడల్, జనార్ధన్‌శెట్టి సాగుచేసిన పొలాల గురించి, రైతుల అనుభవాలు, దిగుబడి గురించి తెలుసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్.సి.చంద్రమౌళేశ్వర్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు

ఉపాధి కార్యాలయ ఉద్యోగుల బదిలీ

వల్లూరు : వల్లూరు ఉపాధి హామీ పథకం కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈ మేరకు డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీవో పార్థ సారథి వీరపునాయునిపల్లె ఏపీవోగా బదిలీ అయ్యారు. కంప్యూటర్ ఆపరేటర్లు రామలింగారెడ్డి కమలాపురం క్లస్టర్ కార్యాలయానికి, లక్ష్మీనారాయణ వీరపునాయునిపల్లె మండలానికి బదిలీ అయ్యారు. టెక్నికల్ అసిస్టెంట్‌లు లక్ష్మీకుమారి పెండ్లిమర్రి మండలానికి, శ్రీవాణి ఖాజీపేట మండలానికి, రెడ్డెయ్య ఆచారి బ్రహ్మంగారిమఠం మండలానికి బదిలీ ఆయ్యారు. కాగా వీరి స్థానాల్లో చెన్నూరు నుంచి ఏపీవో సుధారాణి, ఖాజీపేట నుంచి కంప్యూటర్ ఆపరేటర్ ఉమా, కడప డ్వామా కార్యాలయం నుంచి కంప్యూటర్ ఆపరేటర్ సౌజన్య, ఏపీడీ కార్యాలయం నుంచి టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, చెన్నూరు నుంచి పెద్దపెంచలయ్య, చింతకొమ్మదిన్నె నుంచి టెక్నికల్ అసిస్టెంట్ రామి రెడ్డి బదిలీపై నియమించబడ్డారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

కొండాపురం : రైతుల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కొండాపురంలోని రైతు బరోసా కేంద్రం-1, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్ సెంటర్ నూతన భవనాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతు బరోసా కేంద్రాలను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ఎరువులు, సబ్సిడీ విత్తనాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మండల కేంద్రాల్లో రైతులకు విత్తనాలను అరకొరగా ఇచ్చే వాళ్లన్నారు. మన ప్రభుత్వంలో గ్రామాల్లోనే ఇస్తూ సాగు చేసిన పంటలను గుర్తించి ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతు నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ లేదా దిగుడి రాక ఎక్కువ నష్టపోతే ఇన్సురెన్స్ ఇస్తున్నారన్నారు. మరోసారి జగనన్నను రైతులు ఆశీర్వధించాలన్నారు గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను ప్రజల ఆరోగ్యం పైన ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేశారన్నారు. కొండాపురం పునవాస కేంద్రాల్లో తాగునీటి సమస్య, సిమెంట్ రోడ్లు, డ్రైనేజి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసికెళ్లారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు చింతరాజారెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జగధీశ్వర్‌రెడ్డి, కంట్రాక్టర్ రామంజినేయులురెడ్డి, ఉప మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, కొండు రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వినోద్‌కుమార్, సాయి, బుజ్జి, చోటు, నవజ్యోత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రూ.3.75 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనానికి ఆయన ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, పరిశ్రమల శాఖ రాష్ట్ర సలహాదారుడు రాజోలి వీరారెడ్డి, అగ్రికల్చర్ స్టేట్ అడ్వైజర్ తిరుపాల్‌రెడ్డితో కలసి భూమి పూజ నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికే రూ.36 కోట్ల వ్యయంతో డ్రైనేజ్ కాలువలు నిర్మించామన్నారు. మరో రూ.18 కోట్లతో పెద్ద కాలువల నిర్మాణం, రూ.58 కోట్లతో మంచి నీటి పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. అలాగే డివైడర్, రోడ్డు వైండనింగ్ పనులు కూడా చేస్తున్నామన్నారు. ఆర్‌ఓబీ నిర్మాణానికి ఇప్పటికే ఆరు సార్లు టెండర్లు పిలిచినప్పటికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. ప్రస్తుతం ఈ పనులను కేంద్రం పరిధిలోని సేతు బంధుకు జతచేస్తామని, టెండర్లు పిలుస్తున్నామని, ఖరారు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే బైపాస్ కూడా నిర్మిస్తామన్నారు. మున్సిపాలిటీ భవన నిర్మాణం భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక వసతులతో రూ.3.75 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. ట్రాక్టర్లు, పారిశుద్ధ్య సామాగ్రి నిల్వ ఉంచడానికి విశాలమైన గదులు, కౌన్సిల్ హాల్ నిర్మించాలంటే ఇంత కంటే అనువైన స్థలం లేదన్నారు. ఈ కార్యాలయం ప్రారంభం నాటికి ఆర్‌ఓబీ పూర్తి అవుతుందని, ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. ప్రజలు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి, వైస్ చైర్మన్లు సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, బాల గంగాధర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ భవవ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్

సచివాలయ భవనం ప్రారంభం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల లాంటివని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నచెప్పలిలో రూ. 1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్‌బీకేను అగ్రికల్చర్ స్టేట్ అడ్వైజర్ తిరుపాల్‌రెడ్డి, విలేజ్ క్లినిక్‌ను ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డిలు ప్రారంభించారు. అనంతరం వారు చిన్నచెప్పలి ఆర్‌బీకేలో రైతులకు 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భారతి, సర్పంచ్ అనీసా, ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి, ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, ఎంపీడీఓ జ్యోతి, ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

చెన్నూరు : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరాయని, క్షేత్రస్థాయిలో ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే విధంగా కృషిచేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు, కులాలకు, మతాలకతీతంగా సంక్షేమ పథకాలను అందించాలని ప్రజలకు హామీఇచ్చాడన్నారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉన్న లబ్ధిదారులను గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాల్సిన బాధ్యత మన పైన ఉందన్నారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పని చేసినప్పుడే పార్టీ బలోపేతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ జీఎస్.భాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ దిలీప్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్, సుబ్బారెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఆరవేటి శ్రీనివాసరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వల్లూరు : పార్టీ అభివృద్ధిలో సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథుల పాత్ర కీలకమని, వైఎస్ఆర్‌సీపీ నేతలతో కలిసి ప్రభుత్వ విధానాలను, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. వల్లూరులో బుధవారం జరిగిన వైఎస్ఆర్‌సీపీ నేతలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్య రక్షణే ప్రధాన ధ్యేయంగా సీఎం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, పార్టీ నేతలు ఇందులో పూర్తి స్థాయిలో పాలు పంచుకుని అందరికీ ఆరోగ్యాన్ని అందించడానికి కృషి చేయాలని అన్నారు. ఈనెల 11 నుంచి ప్రారంభం కానున్న మా నమ్మకం నువ్వే జగన్ - ఎందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే సీఎం కావాలి కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలన్నారు. సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులకు పార్టీ బీమా సదుపాయాన్ని కల్పించిందని, ఈనెల 7వ తేదీ లోపు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామ వలంటీర్లందరికీ తన సొంత నిధులతో బీమా సదుపాయాన్ని కల్పిస్తున్నానని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల సలహాదారులు రాజోలు వీరారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ నేతలు శివకుమార్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పరామర్శ

వల్లూరు : అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మండలంలోని బాలుగారిపల్లెకు చెందిన సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే పీరవీంద్రనాథరెడ్డి బుధవారం పరామర్శించారు.

సర్వీస్ రూల్స్ విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్ : మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని ఏపీ ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కడప ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన మున్సిపల్ ఉపాధ్యాయుల సమావేశంలో సర్వీస్ రూల్స్ లేక ప్రమోషన్‌కు అర్హత ఉన్నప్పటికీ ఎన్నో రోజుల నుంచి ఉన్న స్థానాల్లోనే ఉద్యోగం చేస్తున్నారన్నారు. పదేళ్ల నుంచి బదిలీలు జరగక ఏ పాఠశాలలో ఉపాధ్యాయులు అక్కడే ఉండిపోయారన్నారు. ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయులకు విధివిధానాలు రూపొందించి బదిలీలు, ప్రమోషన్లు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుపాకుల మురళి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, గౌరవ సలహాదారు క్రిస్టఫర్‌జాన్, జిల్లా కార్యదర్శులు, మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గరండాల వంకకు సంబంధించి కరెంటు లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో యర్రగుడిపల్లె కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

'ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలి'

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక అన్ని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు సాలిడ్‌వేస్ట్ మేనేజ్మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే వారికి పారిశుద్ధ్యంపై వ్రాతపరీక్ష నిర్వహించి అందులో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, చైర్మన్ చేతుల మీదుగా మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ రామాంజనమ్మ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కొప్పోలులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

వల్లూరు : కొప్పోలులోని ఎస్సీ కలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు.

బుడ్డశనగ విత్తనాల పంపిణీ

వీరపునాయునిపల్లె : మండలంలోని అలిదెన రైతు భరోసా కేంద్రంలో బుధవాం మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టిన బుడ్డశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. 40 శాతం రాయితీతో ఏ ప్రభుత్వం అందించలేదన్నారు. అనంతరం రైతులకు రాయితీ విత్తనాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసుదేవరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఉత్తమారెడ్డి, ఈర్లపల్లె శ్రీనివాసుల్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, గంగాదర, వ్యవసాయ సహాయకుడు శివబాష, రైతులు పాల్గొన్నారు.

పరామర్శ

ఎర్రగుంట్ల : కడపలోని ఓ ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ చేయించుకున్న ఎర్రగుంట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి గంగాకృష్ణారెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి బుధవారం ఆ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ తమ్మిశెట్టి బాలయ్య, తదితరులు పరామర్శించారు.

సచివాలయాలలో డిజిటల్ పేమెంట్లు



పంచాయతీ కార్యదర్శులకు డిజిటల్ బార్ కోడ్ మిషన్లను అందిస్తున్న ఎంపీడీఓ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో డిజిటల్ పేమెంట్లు జరుగుతాయని ఎంపీడీఓ రహమత్తులయ్య తెలిపారు. బుధవారం విజయవాడ నుంచి వచ్చిన నగదు రహిత లావదేవాలకు సంబంధించి పేఏటీఎం క్యూఆర్ కోడ్ మిషన్లను పంచాయతీ కార్యదర్శిలకు అందజేశారు. ప్రజలు గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



బహుమతులను అందజేస్తున్న డిపో మేనేజర్

జమ్మలమడుగు : ఆర్టీసీలో ప్రయాణం చేసే ప్రయాణం చేసేవారికి మెరుగైన సేవలను అందించడం కోసం ఆర్టీసీ సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టిందని డిపో మేనేజర్ ప్రవీన్ తెలిపారు. బుధవారం తాడిపత్రి రహదారిలో తిరిగే ఆర్టీసీ ప్రయాణికులకు గిఫ్ట స్కీంలో భాగంగా డ్రా తీశారు. జమ్మలమడుగుకు చెందిన హారికకు మొదటి బహుమతి, చాగలమర్రికి చెందిన శివశంకర్‌కు రెండో బహుమతి, మూడో బహుమతికి పట్టణానికి చెందిన నాగేశ్వర్‌కు లభించింది.

వాహనాలకు మరమ్మతులు చేయించాలి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థకు సంబంధించిన వాహనాలకు వెనువెంటనే మరమ్మతులు చేయించాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్ చంద్ అన్నారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా పాత మున్సిపల్ ఆఫీసు, సెంట్రల్ జైలు వద్దనున్న శ్మశాన వాటిక, మహాప్రస్థానం శ్మశానవాటిక, సంజన్న సర్కిల్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాహనాల నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. గార్బేజ్ స్టేషన్ నందు ప్రతిరోజూ శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్మశాన వాటికలో గ్రీనరీ పెంచాలన్నారు. అనంతరం ఏపీహెచ్‌బీ కాలనీలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు.